క్లుప్తంగా

ప్రారంభమైన ఎస్‌ఏ-1 పరీక్షలు

ఆదోని సెంట్రల్: పాఠశాలల్లో సెల్ఫ్ అసెస్‌మెంట్ -1 పరీక్షలు బుధవారం ప్రారంభమైనట్లు మండల విద్యాధికారి-2 శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వ, పురపాలక, ఎయిడెడ్, జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు అన్ని ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో కూడా పరీక్షలు జరుగుతున్నాయన్నారు. గతంలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పేరుతో పరీక్షలను నిర్వహిస్తే ప్రస్తుతం సెల్ఫ్ అసెస్‌మెంట్‌గా మార్చారని చెప్పారు.

కూచిపూడిలో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న మిల్టన్ పాఠశాల సిబ్బంది

ఆదోని సెంట్రల్: కళారాధన రజోత్సవ వేడుకలు-24లో ఆదోని పట్టణం మిల్టన్ గ్రామర్ పాఠశాలకు చెందిన రూపాల్ సాయి కూచిపూడి నృత్య ప్రదర్శనలో తన ప్రతిభను చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ నాగరాజు బుధవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఇటీవల కళారాధన నంద్యాలలో రాయలసీమ స్థాయి విద్యార్థి సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించారని తెలిపారు. ఈ పోటీలలో రూపాల్ సాయి కూచిపూడి నృత్య ప్రదర్శనలో మొదటి స్థానంలో, గ్రూపు డాన్స్ ప్రోగాంలో మూడో స్థానంలో గెలిచిందని వారు తెలిపారు.

బీజీ మాదన్నకు నివాళి



మాదన్న స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరురూరల్/టౌన్: మండల పరిధిలోని కె. తిమ్మాపురం గ్రామంలో బుధవారం సీపీఐ సీనియర్ నాయకులు బీజీ. మాదన్న 7వ వర్ధంతిని నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డ య్య, నియోజకవర్గ సీపీఐ నాయకులు పాల్గొని మాదన్న స్థూపం వద్ద నివాళులర్పించారు. గిడ్డ య్య మాట్లాడుతూ మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో పేద ప్రజల పక్షపాతి భూస్వామి, పెత్తందార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసి ప్రజలకు విముక్తి కలిగించిన నాయకుడు బీజీ.మాదన్న అన్నారు. కార్యక్రమంలో మాదన్న కుటుంబ సభ్యులు విరూపాక్షి, సర్పంచ్ మహేశ్వరమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడ్, భాస్కర్‌యాదవ్, రంగన్న, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వాల్మీకి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో ఎంపీపీ గొల్ల కేశన్న, సర్పంచ్ రంగస్వామి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల గ్రామంలో బుధవారం శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎంపీపీ గొల్ల కేశన్న, సర్పంచ్ రంగస్వామి మాజీ సర్పంచ్ కిష్టయ్య, నాయకులు వీజీఆర్ కొండయ్య, ఎల్లమ్మబీడు లక్ష్మన్న తదితరులు శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమల వేశారు. వారు మాట్లాడుతూ వాల్మీకులు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఆర్థికంగా ఎదగాలని, అలాగే ప్రతి పిల్లవాడిని చదివించాలని సూచించారు.

డ్రైనేజీలు ఆక్రమిస్తే చర్యలు



పూడిక తీతపనులు పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ప్రధాన మురుగు కాలువలను ఆక్రమిస్తే తగిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని 15వ వార్డులోని మేజర్ డ్రైనేజీలో పూడిక తీత పనులతో పాటు పార్క్ రోడ్డు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాలువలను మూసివేస్తే పారిశుధ్య సిబ్బంది పూడిక తీత, తదితర పనులు చేపట్టేందుకు ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. అందువలన ప్రజలు, వ్యాపారులు పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మదన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించండి

ఆదోని సెంట్రల్: ఆదోని ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పించాలని నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా డివిజన్ అధ్యక్షుడు బాలు కోరారు. బుధవారం కళాశాల ఆవరణలో ఎన్ఎస్‌యూఐ కార్యకర్తల సమావేశం జరిగింది. అనంతరం ఎన్ఎస్‌యూఐ నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సునీల్, కార్యదర్శి ఉదయ్, సభ్యులుగా పవన్, రవి, రాజ్ తరుణ్, నాగేంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ పై జరిగిన హత్యాచార ఘటన చాల బాధకరమైనది. హత్యకు కారుకులైన వారిని కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. ఇలాంటి ఘటనలు పునావృతం కాకుండా చూడాలి. వైద్యుల విధులకు ఆటంకం కలుగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వైద్యులకు విధి నిర్వహణలో ఒత్తిడి తగ్గించాలి. ముఖ్యంగా ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేసే వైద్యులు, నర్సులు, సిబ్బందికి రక్షణ కల్పించాలి.

– డాక్టర్ మౌనిక, ప్రభుత్వ హాస్పిటల్ డెంటిస్ట్, కోసిగి



ప్రత్యేక చట్టాలు రూపొందించాలి



మహిళా వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించే విషయంలో ప్రభుత్వాలు తప్పనిసరిగా ప్రత్యేక చట్టాలను రూపొందించాలి. రోగికి ప్రాణాలు కాపాడే డాక్టర్లకే రక్షణ లేకపోతే డ్యూటీలు చేయలేం. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని అత్యంత కిరాతకంగా హత్యచే సిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి. ఇలాంటి సంఘటనలు పునారావృతం కాకుండా మహిళా డాక్టర్లకు భద్రతతో ప్రభుత్వాలు భరోసా కల్పించాలి.

– డాక్టర్ సృజన, గైనాకాలజిస్ట్, ప్రభుత్వాసుపత్రి, ఎమ్మిగనూరు

సస్యరక్షణతో 'గులాబీ' పురుగు నివారణ

- పత్తిలో అన్ని రకాల్లో పురుగు ప్రభావం
- పంటకు తీవ్రంగా నష్ట కలిగించే ప్రమాదం
- నివారణపై ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సూచనలు



పత్తి కాయలను ఆశించిన గులాబి రంగుపురుగు



కాయలో ఏర్పడిన గుడ్డి పూలు

గోనెగండ్ల : పత్తి పంటను ఆశించి తీవ్ర స్థాయిలో నష్టం కలుగజేసే పురుగులలో గులాబీ రంగుపురుగు అతి ముఖ్యమైనది. కొన్ని సంవత్సరాల నుంచి ఈ పురుగు అన్ని రకాల బీటీ పత్తులపై కనిపిస్తోంది. తగిన జాగ్రత్తలు పాటించకపోతే తీవ్రంగా నష్టం కలిగించే ప్రమాదం ఉందని ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ మహమ్మద్ ఖాద్రీ హెచ్చరిస్తున్నారు. ఈ పురుగు జీవిత చక్రం, కలుగజేసే నష్టం, నివారణ చర్యల గురించి ఆయన వివరించారు.

24,800 ఎకరాల్లో పత్తిసాగు..

గోనెగండ్ల మండలంలో సాగువిస్తీర్ణం 42,170 ఎకరాలు ఉండగా ఈ సీజన్‌లో 41,160 ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేశారు. అందులో పత్తి 24,800 ఎకరాల్లో సాగయ్యింది.

పురుగు జీవిత చక్రం

కాయతొలుచు తల్లిపురుగు ముదురు గోధుమ రంగులో ఉండి, ముందు రెక్కల పైభాగంలో నల్లని మచ్చలు ఉంటాయి. ఇవి సుమారు 400 గుడ్లను విడిగా గుంపులుగా మొక్కల ఆకులు, మొగ్గలు, కాయల తొడిమెల మీద పెడుతాయి. ఈ గుడ్ల నుండి 3-7 రోజుల లోపు లద్దె పురుగులు వెలుబడి, నాలుగు అంతర దశలను 9-14 రోజులలో పూర్తిగా ఎదిగిన లద్దె పురుగు ముదురు గులాబీ రంగుకు మారుతాయి. లద్దెపురుగులు కాయల పైభాగంలో రంధ్రం చేసి లోపలికి వెళ్లి పూర్తిగా నాశనం చేస్తాయి. తర్వాత బయటకు వచ్చి రాలిన ఆకుల్లో, కాయల్లో కోశస్థ దశకు చేరుకుంటాయి. వీటి నుంచి 8-10 రోజుల్లో రెక్కల పురుగులు బయటకి వస్తాయి. ఆడ రెక్కల పురుగులు 50 రోజుల పైబడి, మగరెక్కల పురుగులు 20 రోజుల వరకు జీవిస్తాయి.

అప్రమత్తంగా ఉండాలి

విత్తిన 45 రోజుల నుంచి ఈ పురుగు ఉనికిని గుర్తించవచ్చును. 20 పూలల్లో రెండు గుడ్డి పూలు లేదా 10 కాయలలో ఒక కాయకు లద్దె పురుగు ఉన్నప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. దీని కోసం ఎకరానికి 8-10 లింగాకర్షక బుట్టలు అమర్చి రోజూ గమనిస్తూ ఉండాలి. ఒక బుట్టలో వరసగా మూడు రోజులు 8 రెక్కల పురుగులు పడితే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. దీనివల్ల మగరెక్కల పురుగులు వీటిలో పడినప్పుడు వాటిని తీసి నాశనం చేయాలి. దీని వలన వాటి సంతతిని అరికట్టవచ్చు. పూత మరియు మొగ్గ దశలో ఉన్నప్పుడు వేపనూనె 5 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. అవసరాన్ని బట్టి క్లోరోపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు లేదా క్వినాల్ ఫాస్ 2మిల్లీ లీటర్లు లేదా ప్రొఫినోఫాస్ 2మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు అయిన సైపర్ మెత్రిన్ లేదా లాండా సైహలోత్రిన్‌లను 100 రోజులు దాటిన తర్వాతనే పిచికారీ చేసుకోవాలి.

నివారణ చర్యలు తప్పనిసరి

గుడ్డి పూలు, రాలిన గూడ, పూత, పిందెలను ఏరి నాశనం చేయాలి. పంటను 150-160 రోజులకు మించి పొడిగించరాదు. పంట తీతలు అయిపోయిన తర్వాత ష్రెడ్డర్‌తో పంట అవశేషాలను భూమిలో కలియదున్నాలి. పొలంలో కానీ, ఇంటి దగ్గర కానీ పత్తి మోళ్లను వంటచెరుకుగా వాడేందుకు నిలువచేయరాదు. వేసవిలో లోతు దుక్కులు తప్పకుండా చేసుకోవాలి. 2-3 సంవత్సరాలకు ఒకసారి పంట మార్పిడి చేసుకోవాలి. ఈ పురుగు ఉధృతికి దోహదం చేసే తుత్తురు బెండ, ఉమ్మెత్త కలుపు మొక్కలు పత్తి పొలంలో మరియు గట్లమీద లేకుండా చూసుకోవాలి.

నష్టం ఇలా..

లద్దె పురుగులు మొగ్గలు, లేత కాయలకు కంటికి కనిపించని రంధ్రాలు చేసి లోనికి ప్రవేశిస్తాయి. కాయలు పెరిగేకొద్ది ఈ రంధ్రాలు మూసుకుపోతాయి. దీంతో పురుగులు ఆశించిన కాయలను బయటి నుంచి గుర్తించడం కష్టం అవుతుంది. లేత మొగ్గలను ఆశించినప్పుడు వాటి ఆకర్షక పత్రాలు విచ్చుకోకుండా ముడుచుకొని గుడ్డిపూలుగా మారుతాయి. ఇవి తొలిదశలోనే రాలిపోతాయి. లద్దె పురుగు లేతకాయలను ఆశించినప్పుడు అవి మొక్కపైనే ఎండిపోతాయి. ఎంత నష్టం జరిగిందో కాయ వొలిచిన తర్వాతనే తెలుస్తుంది. ఈ పురుగులు గింజల లోపలి భాగాన్ని తింటాయి. ఒక గింజ నుండి మరొక గింజకు చేరునప్పుడు మధ్యలో ఉన్న దూదిని కొరికి నష్టపరుస్తాయి. కాయల్లోని ఒక గది నుంచి మరొక గదికి ప్రవేశించేటప్పుడు వాటి గోడల మధ్యలో పొరలకు రంధ్రాలు చేస్తాయి.

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు

గోనెగండ్ల : ప్రస్తుతం సాగు చేసిన వివిధ పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సూచించారు. బుధవారం మండల కేంద్రం గోనెగండ్లలోని రైతు సేవా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పత్తి, ఆముదాం, కంది, మొక్కజొన్న, వరి పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. పత్తి పంటలో గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశం ఉంది కాబట్టి ఎకరానికి 20 లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలన్నారు. ప్రస్తుతం ఆముదం పంటలో నామాల పురుగును గమనించినట్లు తెలిపారు. దీని నివారణకు ప్రొఫినోఫాస్ 2మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. కంది పంటలో ఒక ఎకరానికి 20 కిలోల యూరియా మరియు 15 కిలోల పోటాష్ ఎరువును పైపాటుగా వేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న పంటలో ఎకరానికి 30 కిలోల యూరియా మరియ 15 కిలోల పోటాష్ ఎరువులు వేసుకోవాలన్నారు. అలాగే కత్తెర పురుగు నివారణకు ఏమామెక్తిన్ బెంజోఎట్ 0.3 గ్రాములు ఒక లీటర్ నీటికి కలుపుకొని మొక్క సుడుల్లో మూడు నుంచి నాలుగు చుక్కల ద్రావణం వేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి పి.జె.సుధ

ఆదోని రూరల్: సెప్టెంబర్ 14వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి పి.జె.సుధ సూచించారు. బుధవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో ఆదోని పట్టణంలోని సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లతో సమావేశమయ్యారు. జడ్జి మాట్లాడుతూ.. రాజీకాదగిన కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఏఏ స్టేషన్‌లలో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని కేసులు రాజీ చేయగలరో గుర్తించి కక్షిదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి కేసులు పరిష్కరించడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో జ్యుడిషియల్ ఆఫీసర్స్, సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి జి.అర్చన, మొదటి శ్రేణి అదనపు న్యాయమూర్తి సాయిలీలా సుభాష్, రెండో శ్రేణి అదనపు న్యాయమూర్తి కుమారి సాయిశ్రీవల్లి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎలొకె. సుందర్‌సింగ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించండి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ విశ్వనాథ్

గోనెగండ్ల : ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదోని ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ విశ్వనాథ్ సూచించారు. బుధవారం సాయంత్రం ఆయన గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలు ఎవరైనా తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు నేరుగా కార్యాలయాలకు వెళ్లాలన్నారు. సమస్యల కోసం ప్రజలు కార్యాలయాలకు వస్తే దరఖాస్తును వెంటనే పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామి, ఆర్ఐ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి

ఎమ్మిగనూరురూరల్: స్వచ్ఛందంగా కళ్లు దానం చేస్తే మరోకరికి చూపునిచ్చినవారవుతారని, నేత్ర దానం చేసేందుకు ముందుకురావాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి కోరారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో 39వ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మానవ శరీరంలో అన్ని అవయవాల్లో ముఖ్యమైనవి కళ్లు అని, చూపు లేకపోతే జీవితం చీకటి మయంగా మారిపోయినట్లేనని చెప్పారు. కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో కంటి అపరేషన్లు చేస్తున్నామని, వేరే చోట్లకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోకుండా ఇక్కడే ఆపరేషన్లు చేయించుకోవాలని తెలిపారు. సమావేశంలో కంటి వైద్యులు డాక్టర్ చిరంజీవి, సిబ్బంది, రోగులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనుండాలి



విద్యార్థులకు సూచనలు తెలియజేస్తున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు అన్నారు. బుధవారం ఆదోని పట్టణంలోని శ్రీ జ్యోతిర్మయి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల్లోపు విద్యార్థులు బైకులు నడపరాదన్నారు. అతివేగంగా బైకు రేసింగ్ చేయకూడదన్నారు. కళాశాలలో విద్యార్థులు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ పాల్పడరాదని, గంజాయి తరిదర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలోవిద్యార్థులు,ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

కున్నూరులో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కున్నూరు గ్రామంలో శ్రీకృష్ణ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

గోనెగండ్ల : మండల పరిధిలోని కున్నూరు గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కున్నూరు, కోటకొండ, కొత్తపలి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తులు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి మూడు రోజులు నిత్యపూజలు జరిపారు. మూడో రోజు బుధవారం శ్రీకృష్ణ జయంతి వేడుకలను గ్రామస్తులు, భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం స్వామివారికి జలాభిషేకం, తులసీ అర్చన, నవగ్రహపూజ, క్షీరాభిషేకం, మహా మంగళహారతి నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రంగస్వామి, బావన్న, రామలింగ, తిరుమల నాయుడు, భాస్కర్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

పార్వతి కుటుంబానికి న్యాయం చేయండి

కౌతాళం: రచ్చుమర్రి గ్రామంలో ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్‌లో చనిపోయిన పదో తరగతి విద్యార్థిని పార్వతి కుటుంబానికి న్యాయం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బసవరాజు కోరారు. జిల్లా వ్యాప్త ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం కౌతాళంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ఆర్ఐ రాజశేఖర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. బసవరాజు మాట్లాడుతూ పార్వతి చనిపోయి 20రోజులు గడిచినా ఆమెకు న్యాయం చేయకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సాయివర్మ, సహాయ కార్యదర్శి ఉమేష్‌గౌడ్, హనుమేష్, ఖాదర్ పలువురు పాల్గొన్నారు.

కోసిగి: ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్ ఆధ్వర్యంలో కోసిగిలో విద్యార్థినులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని ఆర్ఐ తిక్కస్వామికి అందజేశారు. నాయకులు విజయ్, బడేసాబ్, అల్లప్ప, ఉసేని, కృష్ణ, మునిస్వామి తదితరులు ఉన్నారు.

గ్రామీణ సమస్యలపై చైతన్య యాత్ర



యాత్రను ప్రారంభిస్తున్న దృశ్యం

మంత్రాలయం : సమస్యలపై నిరంతర పోరాటం చేసి పల్లెలను ప్రగతి బాట పట్టించడమే బీఎస్ఎస్ లక్ష్యమని ఆ సంఘం నాయకులు విజయుడు, దేవేంద్ర, ప్రసన్న, నరసింహా స్వామిలు అన్నారు. బుధవారం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి సన్నిధిలో వేదపండితోత్తములు వెంకన్న స్వామి ఆశీస్సులతో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్ ఆశీర్వాదం తీసుకుని చైతన్య యాత్ర ప్రారంభించారు. అనంతపురం, కర్నూలు జిల్లాలో పర్యటించి గ్రామాల్లో రైతులు, తాగునీటి, రోడ్డు, సాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంఘం నాయకులు లోకేష్, వీరేష్, విజయ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం



బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న బ్యాంక్ రీజనల్ హెడ్ నరసింహరావు

ఎమ్మిగనూరుటౌన్: ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే యునియన్ బ్యాంక్ లక్ష్యమని ఆ బ్యాంక్ రీజినల్ హెడ్ నరసింహరావు అన్నారు. బుధవారం పట్టణంలోని గాంధీనగర్ వద్ద యునియన్ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను బ్రాంచ్ మేనేజర్ సంజిత్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు బ్యాంక్‌లో తగిన సదుపాయాలు సమకూర్చడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది శ్రీకాంత్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ సంస్థలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 5న తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమ పోస్టర్లను బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. రాముడు, రాఘవేంద్ర, యునిస్‌బాషా పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి రూ.70వేల విరాళం



అంబేడ్కర్ విగ్రహ కమిటీకి రూ.70వేలు నగదును అందజేస్తున్న నాయకులు

కౌతాళం: మండల పరిధిలోని సుళేకేరి గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే తనయుడు ధరణిరెడ్డి రూ.70వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ మేరకు నగదును బుధవారం గ్రామ నాయకుల చేతులు మీదుగా కమిటీ సభ్యులకు అందజేశారు. మే నెలలో జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే తనయుడు ధరణిరెడ్డి విగ్రహం అభివృద్ధికి సహకారమందిస్తాని ఇచ్చిన హామీని నెరవేర్చినట్లు నాయకులు తెలిపారు. అలాగే ఎన్నికల సమయంలో బీసీ కాలనీలో ఈరమ్మ గుడిసె పడిపోయింది, ప్రచారంలో ఇది గమనించిన ధరణిరెడ్డి ఆమె కూడా ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఈరమ్మకు కూడా గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుల చేతులు మీదుగా రూ.40వేలను అందజేశారు.గ్రామస్తులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి.. ఎల్లప్పుడు అందుబాటు ఉంటారని రాంపురం రెడ్డి సోదరులు మరోసారి చాటారిని గ్రామపెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదోనిలో మోస్తరు వర్షం



వర్షానికి తడిచిన వేరుశనగ దిగుబడులను నింపుతున్న హమాలీలు

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలో బుధవారం మధ్యాహ్నం అరగంటసేపు ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో చినుకులు పడుతుండగానే ముందు జాగ్రత్తగా యార్డు అధికారులు కమీషన్ ఏజెంట్లకు టార్పాలిన్లను అందించారు. అలాగే కమీషన్ ఏజెంట్ల వద్ద ఉన్న టార్పాలిన్లను రైతులకు అందించి పంట దిగుబడులపై కప్పేశారు. అరగంట పాటు కురిసిన వర్షానికి ప్లాట్ ఫాం సరిగా లేకపోవడంతో అడుగున ఉన్న వేరుశనగ కాయలు తడిశాయి. టెండర్ అనంతరం వ్యాపారులు తడిచిన దానికి ఒకటిన్నర కేజీ బాజు తీసుకొని కొనుగోలు చేశారు. బుధవారం యార్డుకు వేరుశనగ కాయలు 7,760 సంచులు రాగా 2716 క్వింటాళ్లు వచ్చాయి. ఇందుకు గరిష్ఠ ధర రూ.7370, మధ్య ధర రూ.6589, కనిష్ఠ ధర రూ.3369గా పలికింది. యార్డుకు 247 మంది రైతులు వేరుశనగకాయల దిగుబడులను తీసుకొచ్చారు.

రస్తా వదలాలని ..



శవంతో నిరసన చేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని అరుంజ్యోతినగర్ కాలనీకి చెందిన సంజీవ్‌కుమార్(50) అనారోగ్యంతో మృతిచెందారు. అయితే గత కొన్ని రోజులుగా రస్తా విషయంలో మృతుని కుటుంబానికి పక్కింటి వారి వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో పక్కింటివారు రస్తాలో బండలు పాతారు. వాటిని తొలగించాలని మృతుని కుటుంబీకులు కోరుతున్నా వారు ఒప్పుకోవడం లేదు. కాగా, బుధవారం సంజీవ్‌కుమార్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆదిలక్ష్మి, నరసింహులు చేసేదేమిలేక సంజీవ్‌కుమార్ మృతదేహంతో ఇంటి ముందు కూర్చొని పాతిన బండలను తొలగించి, రస్తా వదలాలని నిరసనకు దిగారు. రస్తా వదిలేవరకూ మృతదేహాన్ని తరలించేది లేదని భీష్మించారు. ఈ విషయంపై త్రీటౌన్ సీఐ రామలింగప్ప దృష్టికి తీసుకెళ్లగా పక్కింటివారిని పిలిపించి విచారణ చేపడతామని తెలిపారు.

నాసిరకం కోడిగుడ్లతో అనారోగ్యం

గోనెగండ్ల : ప్రభుత్వ పాఠశాలలకు నాసిరకం గుడ్లు సరఫరా చేయడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు పవన్ తేజ ఆరోపించారు. బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్నమరివీడు పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఉసేని తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ విద్యావ్యవస్థను పటిష్ట పరచాలి

ఆదోని సెంట్రల్: మున్సిపల్ విద్యావ్యవస్థను పటిష్ట పరిచే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఉపాధ్యాయుల సమాఖ్య నాయకులు కోటన్న, బడుగు బసవరాజు కోరారు. బుధవారం అర్థగేరి బసవనగౌడ్ పురపాలక ప్రాథమిక పాఠశాలలో భోజన విరామ సమయంలో ఏపీ ఎంటీఎఫ్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. చంద్రమౌళి, దస్తగిరి, ఆనంద్, మద్దయ్య పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శాంతి

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం(జనరల్) విద్యార్థులు కుస్తీ పోటీలలో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ శాంతి బుధవారం తెలిపారు. వారు మాట్లాడుతూ రేణిగుంట్లలో ఈ నెల 26, 27వ తేదీలలో రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు జరిగాయని తెలిపారు. అందులో అనురాధ, అఖిల, మౌనిక గోల్డ్ మెడల్ సాధించగా అక్షయ, అఖిల సిల్వర్ మెడల్ సాధించారన్నారు. శైలెజ, గుండమ్మ, అక్షయ బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్: పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోసిగి క్రాస్ రోడ్డు వద్ద బుధవారం అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న కోసిగి గ్రామానికి చెందిన బోయ నాగరాజును అరెస్టు చేసినట్లు ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపారు. సదరు వ్యక్తి వద్ద నుంచి పల్సర్ మోటార్ సైకిల్, 5 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.